# కాశ్మీర్ ప్రజల న్యాయమైన ఆంకాక్షలను, న్యాయాన్ని ఓడించేందుకు సైనికాధికారుల ప్రయత్నాలు

**చొరబాటుదారులను** నిరోధించే పేరుతో 1980లో మణిపూర్ రాష్ట్రంలో కేంద్రప్రభుత్వం 'సైనిక బలగాల ప్రత్యేకాధికారాల చట్టం-1958 (ఏఎఫ్ఎస్‌పిఏ)'ను విధించింది. తదనంతర కాలంలో ఏదో ఒక సాకుతో ఇతర ఈశాన్య రాష్ట్రాలకు, జమ్ము - కాశ్మీర్‌కు కూడా దీనిని వర్తింపజేసింది.

ఈ చట్టం దన్నుతో ఆ రాష్ట్రాలలో విధుల నిర్వహణలోవున్న సైనిక బలగాలు, పారామిలటరీ బలగాలు ప్రజలపై బూటకపు ఎదురు కాల్పులు, మహిళలపై అత్యాచారాలు, దోపిడీలు, లూటీలు సాగిస్తూ, ప్రశ్నించే గొంతులను అణచివేయటం వంటి అనేక రూపాల్లో చట్టభీతి లేకుండా సాధారణ, అమాయక ప్రజల జీవితాల్లో భయోత్పాతాన్ని సృష్టిస్తున్నాయి.

ఈ రాష్ట్రాలలో ప్రజానీకం తమ జీవితాలతో, ఆస్తులతో, హుందాతనంతో చెలగాటమాడుతోన్న సైనిక బలగాల దుశ్చర్యలను నిరసిస్తూ నిరంతరాయంగా ఆందోళనలు సాగిస్తూ వున్నారు. సాధారణ అమాయక ప్రజలపై దుర్మార్గాలకు పాల్పడిన, అందుకు బాధ్యులైన సైనికులను లేదా అధికారులను కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేస్తూ వున్నారు. సైనిక బలగాలు సాగించే అకృత్యాల బారినుండి తమను రక్షించటంతోపాటుగా, సైనిక బలగాల దుర్మార్గాలకు మరింత ఊతమిస్తున్న ఏఎఫ్ఎస్‌పిఏను రద్దుచేయాలని కూడా కోరు తున్నారు.

### ప్రజల పాలిట ఉరితాడు-ఏఎఫ్ఎస్‌పిఏ

అయితే ఏఎఫ్ఎస్‌పిఏను రద్దుచేయాలన్న బాధిత ప్రజానీకపు న్యాయమైన డిమాండ్ పట్ల కేంద్ర పాలకులు చెవొగ్గటంలేదు. ప్రత్యేకించి మనదేశ సార్వభౌమత్వం, రక్షణ, సమగ్రతలవంటి ప్రయోజనాల పరిరక్షణకోసం ఎఎఫ్ఎస్‌పిఏను రద్దుచేయటానికి సైనిక విభాగం అంగీకరించటం లేదనే సాకుతో, ఆ డిమాండ్‌ను తోసిపుచ్చుతున్నారు. ఎఎఫ్ఎస్‌పిఏ అమలులోవున్న ఆయా రాష్ట్రాల ప్రజల పాలిట ఉరితాడుగా మారిన ఆ చట్టం రద్దు అంశం అనుచితమైనదిగా సైనిక విభాగాలలోని ఉన్నతాధి కారులు అదేవిధంగా ఆయా రాష్ట్రాల లెఫ్టినెంట్ గవర్నర్లు పైన పేర్కొన్న కారణాలనే పునరుద్ఘా టిస్తున్నారు.

1979 నుండి 2012 వరకు కేవలం ఒక్క మణిపూర్ రాష్ట్రంలోనే బూటకపు ఎదురుకాల్పుల హత్యలు 1528 జరిగాయి. ఇవిగాక మహిళలపై అత్యాచారాలు, అపహరణల కేసులు ఈ కాలంలో అనేకం జరిగాయి. రాష్ట్రప్రభుత్వం కానీ, లేదా సంబంధిత సైనికబలగాలు కానీ ఈ నేరాలకు కారకులైన వారిని శిక్షించే అవకాశం లేకుండా ఎఎఫ్ఎస్‌పిఏ చట్టం కల్పించే ప్రత్యేధికారాల మాటున రక్షణ పొందుతున్నారు. సాధారణ సైనిక చట్టం ప్రకారమైనా దోషులను కనుగొని, వారిని శిక్షించే ప్రయత్నాలు కూడా జరగటంలేదు.

"కుల, మత, ప్రాంత, లింగవివక్ష లేకుండా పౌరులందరినీ సంరక్షిస్తామని" ప్రకటించుకొని తమ అధికార విధులు నిర్వహిస్తున్న సైనిక బలగాలు- అంతర్గత గందరగోళాలను, బాహ్యాచొరబాట్లను అదుపుచేసే కర్తవ్యం నిర్వహిస్తున్న తమకు ఎఎఫ్ఎస్‌పిఏ ఓ గౌరవపూర్వక సౌకర్యంగా భావించే దృష్టికోణాన్ని కాలక్రమంలో పెంచుకున్నారు. అందుచేత ఈ ప్రాంతాలలో తమ చిత్తమొచ్చిన విధంగా "దోపిడీలు, లూటీలు, హత్యలు" సాగించే, 'ప్రశ్నించే అవకాశం లేని హక్కు'ను తమకు ఈ చట్టం కల్పించిందనేంత దూరం వెళ్ళారు. ఈ దేశంలో ఒక చట్టం, న్యాయం అనేవి వున్నాయని అంగీకరించటానికి కూడా వారు సిద్ధంగా లేరు.

మరోవైపున సైనిక బలగాల చేతుల్లో చెప్పరాని అకృత్యాలకు గురవుతున్న ఆయా ప్రాంత ప్రజలు ఎఎఫ్ఎస్‌పిఏను రద్దుచేయాలని, ప్రజలపై నేరాలకు పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేస్తూ ఎడతెగని ఆందోళనలు సాగిస్తూనే వున్నారు. ఎఎఫ్ఎస్‌పిఏను సంపూర్ణంగా రద్దు చేయాలనే న్యాయమైన ఆకాంక్షను, డిమాండ్‌ను వారు వ్యక్తం చేస్తున్నారు.

### బూటకపు ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టులో విచారణ

మణిపూర్‌లో జరిగిన 1528 బూటకపు ఎన్‌కౌంటర్లపై విచారణ జరపాల్సిందిగా కోరుతూ సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వాజ్యం దాఖలైంది. దీనిపట్ల సరిగ్గానే స్పందించిన న్యాయస్థానం, ప్రజా జీవితంలో ప్రముఖులైన ముగ్గురితో-సంతోష్ హెగ్డే (విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి), జె.ఎమ్. లింగ్డో(మాజీ ఎన్నికల ప్రధానాధికారి), అజయ్ కుమార్(మాజీ డిజిపి)లతో కూడిన ఓ కమిటిని ఏర్పరచి, ఈ ఆరోపణలపై విచారించి ఓ నివేదికను సమర్పించాల్సిందిగా కోరింది. తర్వాత సుప్రీంకోర్టు ఈ ఎదురుకాల్పుల ఘటనలన్నింటిపై విచారణ జరపదలచుకుంది. కేంద్రప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్ తన వాదనలు వినిపిస్తూ, ఆయా రాష్ట్రాలలో 'యుద్ధతరహా' పరిస్థితులున్నాయని, ఎఎఫ్ఎస్‌పిఏ వంటి చట్టంతో సైన్యానికి విశేషాధికారాలు కల్పించాము కనుక ఈ ఎన్‌కౌంటర్ల గురించి విచారణ చేపట్టాల్సిన అవసరమే లేదన్నాడు. అయితే సుప్రీంకోర్టు ప్రభుత్వంయొక్క ఈ వాదనతో విబేధించి సిబిఐ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (ఎస్ఐటి) ఏర్పరుస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ ఎన్‌కౌంటర్ల ఘటనలతో సంబంధం వున్న సైనిక, పోలీసు అధికారులపై నిర్దిష్ట కాల వ్యవధిలో అభియోగ పత్రాలను రూపొందిం చాల్సిందిగా కూడా ఆదేశించింది.

తదనుగుణంగా మణిపూర్‌లో ఈ బూటకపు ఎదురుకాల్పుల ఘటనలతో సంబంధంవున్న సైనికులపై, అస్సాం రైఫిల్స్ దళంపై, పోలీసులపై అభియోగ పత్రాలు రూపొందించి కోర్టుకు సమర్పించింది. ప్రస్తుతం సైనిక బలగాల అధికారు లందరూ కలసికట్టుగా ఈ న్యాయప్రక్రియను ఓడించే ప్రయత్నాలలో వున్నారు. ఈశాన్య భారతం లోనూ, జమ్ముకాశ్మీర్ రాష్ట్రంలోనూ ఎఎఫ్ఎస్‌పిఎ అమలును అలాగే బూటకపు ఎదురుకాల్పుల హత్యాకాండను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కాగా, ఈ నేరాలతో సంబంధం వున్న సైనిక బలగాలపై సుప్రీంకోర్టులో విచారణ జరపబూను కోవటాన్ని సైనికాధికారులంతా కలిసికట్టుగా ఎదిరించే సన్నాహాలలో వున్నారు.

ఎఎఫ్ఎస్‌పిఎ సంబంధిత కేసులపై తమ దృక్పథాన్ని వివరించే పేరున తమ చేతులను కట్టివేసే ప్రయత్నాలపట్ల తాము చింతిస్తున్నామని ప్రకటిస్తూ 700 మంది సైనికాధికారులు, ఒక బ్రిగేడియర్‌తో సహా 75 మంది ఇతర అధికారులు "ఎఎఫ్ఎస్‌పిఎ నిబంధనలను నీరుగార్చే ప్రయత్నం"గా దీనిని పేర్కొంటూ సుప్రీంకోర్టులో సామూహికంగా పిటిషను దాఖలు చేశారు. దీని కొనసాగింపుగా జమ్ముకాశీర్‌కు చెందిన ఓ 'మేజర్' తండ్రి సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ వేశాడు. షోపియాన్‌లో జమ్ముకాశ్మీర్ పోలీసులు జరిపిన కాల్పులలో ఒక పౌరుడు మరణించటంపై తన కుమారునికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో ఎఫ్ఐఆర్ ప్రవేశ పెట్టటంపై ఆయన కూడా సుప్రీంకోర్టును ఆశ్రయించాడు.

## సైనిక బలగాల దుశ్చర్యలకు ఎన్‌డిఏ పాలకుల సమర్ధన

సైనిక బలగాల చరిత్రలో ఈవిధంగా అందరూ కలసికట్టుగా సుప్రీంకోర్టులో వాదనలు చేయబూను కోవడం వూహించలేనిది. వీరంతా న్యాయస్థానాలలో సమిష్టిగా వ్యవహరించటం నిషేధితం. ప్రభుత్వ సేవారంగాలలో లేదా ప్రభుత్వ కార్పొరేషన్లువంటి అర్ధ-ప్రభుత్వ సేవారంగాలలో సైతం ఉదాహరణకు ఏపిఎస్ఆర్‌టిసి నియమ నిబంధనలలో కూడా ఈ విధమైన సమిష్టి వ్యతిరేక చర్యను తీవ్ర క్రమశిక్షణా చర్యగా పరిగణిస్తారు. అయితే ప్రస్తుత సందర్భంలో సైనిక బలగాలన్నీ సామూహికంగా "సమిష్టి" పిటిషన్ దాఖలు చేయడాన్ని ప్రస్తుత ఎన్‌డిఏ పాలకులు "ఉదారంగా" చూస్తున్నారు. కేంద్ర రక్షణశాఖామంత్రే సైనిక బలగాల చర్యను పరోక్షంగా సమర్ధిస్తూ "నాకు (నిర్మలాసీతారామన్) సుప్రీంకోర్టును ఆశ్రయించిన సైనికాధికారుల బృందంపట్ల ఏవిధమైన స్పర్ధ లేదు. వారంతా సుప్రీంకోర్టులో ఎఎఫ్ఎస్‌పిఎ సంబంధిత కేసులపై తమ దృక్పథాలను వివరించదలిచారు. వారి బాధలను స్వయంగా వివరించుకోవటం వారు హక్కు. మీకేదైనా కష్టం వుంటే వాటిని చెప్పుకోవద్దని నేను కోరదలచుకోను" అని మాట్లాడారు.

"సైనిక, నావికా, వైమానిక బలగాలలో తమ సమస్యల పరిష్కారంకోసం సంస్థాగతయంత్రాంగాలు వారికి అందుబాటులో వున్నాయి. అయినప్పటికీ ఎఎఫ్ఎస్‌పిఎ విషయంలో వలెనే వారు న్యాయ స్థానాలనే ఆశ్రయిస్తున్నారు. సైనికులు, వారి అధికారుల మనస్సుల్లో వేదన కొనసాగుతోంది. క్షేత్రస్థాయిలో వుండే సైనికుల గురించి, అధికారుల గురించే మేము మాట్లాడుతున్నాం. ఈ కారణంగానే ప్రభుత్వపరంగా అడ్వొకేట్ జనరల్, అటార్నిజనరల్ సుప్రీంకోర్టులో వారికి మద్దతుగా వాదనలు వినిపించటానికి హాజరవుతున్నారు" అని ఆమె తన వాదనను సమర్ధించుకున్నారు.

ఈ రకమైన ఉదార, స్వచ్ఛ పోజుతో ఎన్‌డిఏ పాలకులు-సైనిక అధికారులు, సైనిక బలగాలు అమాయక పౌరులను హత్యగావించటంపై న్యాయ విచారణను వ్యతిరేకిస్తూ సామూహికంగా దాఖలు చేసిన పిటిషన్‌ను సమర్ధిస్తున్నారు. ఎఎఫ్ఎస్‌పిఎ రద్దు చేయాలనే డిమాండ్‌కు వ్యతిరేకంగా సైనిక బలగాలను ఎన్‌డిఏ పాలకులే ప్రేరేపిస్తున్నారని దీనితో మనం నిర్ధారణకు రావచ్చు. ఆవిధంగా ఈ చట్టాన్ని దుర్వినియోగపరుస్తూ సైనికులు తమ ఆనందంకోసం నిర్భీతిగా, తమను ప్రశ్నించే అవకాశమే లేకుండా పౌరులను హతమార్చటం, మహిళలపై అత్యాచారాలు గావించటం, వారి ఆస్తుల లూటీకి పాల్పడటం వంటి దుర్మార్గాలకు పాల్పడుతూ పాలకుల పనుపున ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోన్నారని స్పష్టమౌతోంది.

## దేశ సార్వభౌమత్వం, సమగ్రతల ముసుగులో నేరాలు

ప్రజలపై అత్యాచారాలు జరపడానికి, హత్యలు గావించడానికి, లూటీచేయడానికి ప్రశ్నించవీలులేని రక్షణలను రాబట్టుకోవటంకోసమే, నేరస్తులైన సైనిక బలగాలకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో జరిగే విచారణకు వ్యతిరేకంగా సైనికబలగాలు పిటిషన్ దాఖలు చేశాయని అర్ధమౌతోంది. దేశ సార్వ భౌమత్వం, రక్షణ, సమగ్రతలను ఉన్నతంగా కాపాడే ధర్మాన్ని నిర్వర్తిస్తున్నారని, మనం నిలిచి వుండటానికి పునాదిగావున్న భారత రాజ్యాంగం సైతం మనుగడ కొనసాగిస్తూ, దేశం అభివృద్ధిపథంలో పయనించ టానికి కారణభూతులుగా వున్న సైన్యం, సైనికాధికారులు కొంత గందరగోళంలో వున్నారని, వారి నాయకత్వం క్రిందనున్న సైనికులనుండే ప్రశ్నలను ఎదుర్కొంటున్నారని, శాంతికాలపు కార్యకలాపాల తరహాలో, శాంతిభద్రతల తరహాలో సిఆర్‌పిసి ప్రమాణాలతో యుద్ధతరహా కార్యకలాపా లను, చొరబాట్లను ఎదుర్కొనే పనిని తాము కొనసాగించగలమా అని ప్రశ్నిస్తున్నారంటున్నారు. సైనిక బలగాలకు తగిన రక్షణ, భద్రతలు కల్పించకుండా కేవలం వారు తమ విధులకు మాత్రమే పరిమితమయ్యేట్లయితే అది దేశ సమగ్రత, సార్వభౌమత్వాలకు పెనుముప్పును కల్గిస్తుందని, తద్వారా రాజ్యాంగబద్ధ సార్వభౌమాధికార ప్రజాస్వామ్య రిపబ్లిక్‌గా మన మనుగడ ప్రమాదాన్ని ఎదుర్కొంటుందని వాదన చేస్తున్నారు. సాయుధ శత్రువులతో, విద్రోహులతో, అసాధారణ పరిస్థితుల నడుమ యుద్ధతరహా కార్యకలాపాలను నిర్వహించే సైనికుల వ్యవహార శైలికి సంబంధించిన సంపూర్ణ చిత్రం సివిల్ పోలీసులకు లేదా సిబిఐకి సైతం వూహకందదని కూడా వారు వాదిస్తున్నారు.

ఈ విధమైన గంభీర పదాడంబరాలతో, దేశభక్తి, భావోద్వేగ అంశాలను మేళవిస్తూ, సైనిక బలగాలకు చెందిన పిటిషన్‌దారులు ఈ దేశ పౌరుల కంటే తాము అతీతులమని, ఈ దేశ చట్టాలకు తాము లోబడబోమని చెప్పదలచుకున్నారు.

సైనిక బలగాల ఈ వాదన సమర్ధకులు ఏమంటారంటే, భారత సైన్యానికి వారి విధులకు తోడు అదనంగా అంతర్గత కల్లోలాలను ఎదుర్కో వాల్సిన బాధ్యతలు కూడా వున్నాయంటున్నారు. ఇది కూడా అసంగతమైనదే. వాస్తవానికి సైనిక బలగాలలో కొందరికి వ్యతిరేకంగా దాఖలైన పిటీషన్లన్నీ కూడా వారి 'సమర్ధతపైనో' లేదా దేశ సమగ్రత, సార్వభౌమాధికారాల పరిరక్షణకు పోలీసులు విఫలమైన సందర్భంలో దేశంలో అంతర్గత కల్లోలాల్ని సద్దుమణిగించేటప్పుడో, జాతీయ విపత్తులలో పునరావాస సహాయ కార్యక్రమాలు నిర్వహించేటప్పుడో దాఖలైనవి కావు. ఎఎఫ్ఎస్పిఎ ప్రాంతాలలో దేశపౌరులపై క్రూరమైన, అమానవీయ నేరాలైన బూటకపు ఎదురుకాల్పులు, అత్యాచారాలు, లూటీలు, అపహరణలు సాగించిన నేరాలపై దాఖలైన పిటిషన్లు మాత్రమే. సాక్ష్యాలను రూపుమాపేందుకు, ధ్వంసంచేసేందుకు, సాక్ష్యులను బెదిరింపులకు గురిచేసేందుకు, హత్యలకు సైతం పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఎవరైనా ఒక సైనికాధికారి నేరానికి పాల్పడివుంటే "నేరాలను విచారించే న్యాయస్థానం నుండి నిరపేక్ష మినహాయింపు పొందే విధానమే లేద"ని సుప్రీంకోర్టు సరిగ్గా, స్పష్టంగా పేర్కొంది. అలాగే సైనికులు, అస్సామ్ రైఫిల్స్ బలగాలు, మణిపూర్ పోలీసులు జరిపిన చట్టవిరుద్ధ హత్యలు, బూటకపు ఎదురు కాల్పులను సహించరాదని సుప్రీంకోర్టు ప్రకటించింది.

కనుక, ప్రభుత్వం కోర్టులో చేపట్టిన వాదనలను వ్యతిరేకించటం అంటే, సైనిక వ్యవస్థను, మొత్తం సైనిక బలగాలను వ్యతిరేకంచటం కాదు; ఎవరైతే నేరాలకు పాల్పడ్డారో వారిని వ్యతిరేకించటం. అలాగే ఇదేదో దేశ సార్వభౌమత్వం, సమగ్రతలకు సంబంధించిన అంశమూ కాదు. దేశ పౌరులపై కొందరు సైనికులు, వారి అధికారులు సాగించిన అకృత్యాలకు సంబంధించిన అంశం మాత్రమే.

ఇంత తేలికైన, సూటైన అంశం ఎందుకు గందరగోళం కల్పించిందో, సైనికాధికారులు ఎందుకు గందరగోళానికి లోనయ్యారో, సైన్యం తమను అడిగే ప్రశ్నలకు వారెందుకు జవాబులు చెప్పలేని స్థితికి గురయ్యారో, విధులను సక్రమంగా నిర్వహించటానికి, విధుల నిర్వహణలపేరిట నేరాలకు పాల్పడటానికి మధ్య తేడాను ఎందుకు వారికి వివరణ ఇవ్వలేకపోయారో అనేది అర్ధం కాదు.

ఎఎఫ్ఎస్పిఎ రద్దుచేయాలనే డిమాండ్‌ను వ్యతిరేకించే, ఎఎఫ్ఎస్పిఎ ప్రాంతాలలో సంభవించే నేరాలపట్ల ఎలాంటి పట్టింపులేని పాలక రాజకీయ నాయకులకనుగుణంగా, వారి మెప్పుపొందుతూ మసలుకొనే కొందరు సైనికాధికారులు తాము సాగించిన అకృత్యాలపై, న్యాయవిచారణను వ్యతిరేకించే వారుగా వున్నారనేది వివిధ సంఘటనల ద్వారా స్పష్టమౌతోంది.

**ప్రజలపై అకృత్యాలకు పాల్పడిన అధికారులకు మెచ్చుకోళ్ళు**

సైన్యంలో ఉన్నతస్థాయిలో వుండి ప్రజలపై నిస్సంకోచంగా నేరాలకు పాల్పడుతున్న వీరిని పదవులనుండి తప్పించటమో లేక వారి సైనికచట్టం ప్రకారమైనా శిక్షంచటమో చేయకపోగా వారిని సమర్థిస్తూ, ప్రోత్సహిస్తున్నారు.

2017 ఏప్రిల్ 9న జమ్ముకాశ్మీర్‌లో మేజర్ లీతుల్ గొగోయ్ అనే సైనికాధికారి ఫరూక్ అహ్మద్‌దార్ అనే యువకుని మానవ కవచంగా వుపయోగించాడు. జమ్ముకాశ్మీర్‌లో రాళ్ళు విసిరే వారికి వ్యతిరేకంగా 'మానవ కవచాలను, ఉపయో గించరాదని దేశవ్యాపితంగా నిరసన రగుల్కొంది.

ప్రజల భావోద్వేగాలను గౌరవించి, తప్పు చేసిన మేజర్‌ను శిక్షించేబదులు, మచ్చలేని అద్భుతమైన సేవలందించినందుకుగానూ అతనిని సైనిక ప్రధానాధికారి అభినందించటంతోపాటు, అతనిని ఈనాటికీ అక్రమ చొరబాటుదారుల వ్యతిరేక కార్యకలాపాల నిర్వహణలో జమ్ము కాశ్మీర్‌లోనే కొనసాగిస్తున్నారు. దార్ అనే అతనిని మానవకవచంగా ఉపయోగించటంవలన ఎవరిపై లాఠీఛార్జీ జరపకుండా, కాల్పులు సాగించకుండా తాను అనేక ప్రాణాలను కాపాడానని మేజర్ గర్వంగా బహిరంగంగా ప్రకటించాడు కూడా.

ఎన్‌డిఏ ప్రభుత్వం తప్పుచేసిన మేజర్‌కు అనుకూలంగా కోర్టులో తన అటార్నీజనరల్ ద్వారా వాదన సాగించి ఆయనను సమర్ధించటమేగాక, "ఇందులో తప్పేముంది? ఇలాంటిదే మరోసారి జరిగితే తిరిగి కూడా ఇలానే జరుగుతుంది. మేము వందశాతం సైన్యానికి, మేజర్‌కు అండగా వుంటాం" అని పేర్కొన్నాడు. "మేజర్ గొగోయ్ దేశంకోసం తన ప్రాణాలను పణంగా పెట్టాడు; అతని విమర్శకులు మాట్లాడుతున్నదంతా వట్టి చెత్త" అని కూడా చెప్పాడు.

అయితే, ఈ మధ్యకాలంలోనే మేజర్ గొగోయ్ ఒక స్థానిక మహిళతో 'స్నేహం చేయడం- చనువుగా వుండటం'అంశం గురించిన నేరారోపణపై సైనిక న్యాయస్థానం విచారణ చేపట్టక తప్పలేదు. అతను విధులు నిర్వహించాల్సిన ప్రదేశం నుండి దూరంగా వున్నందుకుగాను, దుష్ప్రవర్తన కారణంగా అతనిని ఆ యూనిట్‌నుండి బదిలీ చేశారు. సైనిక సిబ్బందియొక్క నేరచరితయొక్క వాస్తవిక రూపం ఇలా వుంటుంది.

అదేవిధంగా ఉన్నత స్థాయిలలోనున్నవారు, ప్రజలపై నేరాలకు పాల్పడినవారిని ఎలా పరిరక్షిస్తారో కూడా దీనిద్వారా తెలుస్తోంది. సహజంగా సైనిక దళాల ప్రధానాధికారి రాజకీయే తరంగా వ్యవహరించాలి. కాగా ప్రభుత్వ విధానాలపై బహిరంగంగా ప్రసార మాధ్యమాలలో ప్రస్తుత పాలక బిజెపి ప్రభుత్వ విధానాల సమర్ధకుడిగా ఆయన మాట్లాడాడు. బిజెపి ప్రభుత్వ విధానాలు ప్రజా వ్యతిరేకంగా ప్రత్యేకించి జమ్ముకాశ్మీర్ మరియు ఈశాన్య రాష్ట్రాలకు వ్యతిరేకంగా వుండగా సైనిక ప్రధానాధికారి పాత్ర కూడా వివాదాస్పదంగానూ సారాంశంలో ప్రజావ్యతిరేకమైనదిగానూ వుంది. ఒక ప్రజాస్వామిక ప్రభుత్వం దీనిని అనుమతించి, ఆమోదించరాదు.

### పాలకవర్గాల సేవలో సైన్యం

వాస్తవానికి దేశంలో ఆంతరంగిక కల్లోలాలను అదుపుచేయటం, భారత సైన్యంయొక్క కర్తవ్యంగా లేదు. అది ప్రధానంగా సార్వభౌమాధికార సరిహద్దులను కాపుగాయటం, సరిహద్దులలో పొంచివున్న శత్రువుల కార్యకలాపాలను అరికట్టటం చేయాలి. కానీ దోపిడీ అణచివేత విధానాలను వలసవారసత్వంగా పొందిన మన 'స్వతంత్ర' భారత పాలకులు, ప్రజలమధ్య సమస్యలు ఏర్పడినపుడు, ప్రజాందోళనలను అణచటానికి సైన్యాన్ని ఒక సాధనంగా ఉపయోగిస్తున్నారు. అంతర్గత భద్రత, జాతీయ సమగ్రతల పేరుతో సైన్యం ఉద్దేశ్య పూర్వకంగా అధికారంలోని పాలక పార్టీల, పాలకవర్గాల ప్రయోజనాలకు సేవచేస్తోంది.

అధికారంలోనున్న పాలకుల నుండి సైనిక బలగాలు ఎదుర్కొంటున్న ప్రధానమైన సమస్య ఇది. సైనిక బలగాలను బుజ్జగించి, వారిని తన చేతిలో సాధనంగా మలచుకోవటానికి, ఎఎఫ్ఎస్‌పిఏవంటి చట్టాలతో ప్రత్యేక అవకాశాలను సైనిక బలగాలకు కల్పించి, వారి చట్టభీతిలేని దుర్మార్గ చర్యలన్నింటికీ మినహాయింపులిచ్చే విధానాన్ని చేపట్టారు. ఇది ఎంతవరకూ దారి తీసిందంటే, సాధారణ పౌరుల కోసం ఉద్దేశించిన దేశంలోని చట్టాలనుండి, క్రిమినల్ చట్టాలనుండి సైతం తమకు సంపూర్ణ మినహాయింపు నివ్వాలని కోరేవరకూ కొందరు ఉన్నత సైనికాధికారులు వెళ్ళారు. ఈ డిమాండ్‌ను ఎన్‌డిఏ పాలకులు ప్రేరేపించి పరోక్షంగా సమర్ధిస్తున్నారు. తదనుగుణంగానే ప్రభుత్వ అడ్వకేట్ జనరల్, అటార్నీ జనరల్ ఇరువురూ సుప్రీంకోర్టులో తమ వాదనలు వినిపిస్తూ ఒక పౌరుని మానవ కవచంగా వినియోగించిన మేజర్ లలిత్ గొగోయ్ కేసులో వలెనే ప్రభుత్వ అభిప్రాయాన్ని వివరించారు.

### న్యాయమైన ప్రజల ఆంకాంక్షను సైనికశక్తితో అణచజాలరు

ఎఎఫ్ఎస్‌పిఏ విధించిన రాష్ట్రాలలో దానిని రద్దుచేయాలనే; చట్టవిరుద్ధ హత్యలకు పాల్పడిన, బూటకపు ఎదురుకాల్పులు సాగించిన, అత్యాచారాలు, లూటీలు చేసిన సైనికులను, అధికారులను శిక్షించాలనే ప్రజల న్యాయమైన డిమాండ్‌కు, ఆకాంక్షకు వ్యతిరేకంగా ఒక పద్ధతి ప్రకారం నిరంతరాయ ప్రయత్నం జరుగుతూవుందో ఏవిధంగా జరుగుతోందో దీనితో స్పష్టమౌతోంది. అమానవీయ ఘోరాలకు పాల్పడిన సంబంధిత సైనికులు, అధికారులపై ప్రత్యేకించి మణిపూర్ రాష్ట్రంలోని నేరాలపై ప్రారంభమైన న్యాయవిచారణ ప్రక్రియను ఓడించటానికి ఎంతటి పకడ్బందీ ప్రయత్నం సాగుతూందో తెలుస్తోంది.

సైన్యం చేతులు కట్టివేయటంగా, లేదా యావత్ సైనిక వ్యవస్థనే వ్యతిరేకించటంగా చిత్రించటమనేవి తప్పుడు ప్రచారాలు మినహా వేరుకాదు. ప్రజల ఆకాంక్షను, ప్రయోజనాలను సైనికశక్తితో అణచ జూడటం నిజమైన ప్రజాస్వామిక వ్యవస్థలో కొనసాగనీయరాదు.

ooooo